తెర

పూడిపెద్ది వెంకటరమణయ్య గారు

౧

పెయ్యను నాకి మూర్కొనే ఆలకు ప్రేమ తెలుసును. కంఠంలో మేత దాచి కందుకు మేపే కాకికి ప్రేమ తెలుసును. జంబ బాయని గువ్వకు ప్రేమ తెలుసును. సంసారం చేస్తూన్న దంపతులకు ప్రేమ తెలుసును. జగత్తులో గల ప్రతిజీవికిని పరమాణువు మొదలనంతపరిణామమువరకునూ తారతమ్యముల సూచించు ప్రేమావేదన యనుభవమే. ఇట్టి ప్రేమను పూలు నిట్టూర్చినట్టు, పున్నమచందురుడు నవ్వినట్టు, చిగురాకు పులకించినట్టు, చిఱుగాలి కౌగిలించినట్టు లోకమంతటా అనుక్షణమూ, ప్రకృతి ప్రదర్శిస్తూనే ఉంటుంది. ఈ ప్రేమప్రవాహమున వంతెనల కట్టి, ఆనకట్టుల నమరించి, పడవల నడిపి, చిన్నికాల్వల చీలికల పారించి, చెలమల నూరించి, చెరువుల నిలవరించి మానవుడు సరిచేయుచున్నా ననుచున్నాడు; సంతరించుచున్నా ననుచున్నాడు. దీనితత్వ మెఱుగనివారు వంతెన గలచోట లంఘింపబోయి, ఆనకట్టున పడవ నాడింపబోయి, చెరువులో విహరింపబోయి, చెలమల నీదబోయి, కాల్వల నిలుపబోయి కళవళపడుచున్నారు. ప్రేమ అనుభవనీయమయిన ఆపద! విడువదగిన విధి! ఏమి చేయవలయును? అదియే జగన్నిర్మాణ సూత్రము.

మధుసూదనరావు ప్రేమసూత్రాలలో పెనుచుకుపోయాడు; గాలిపడగలాగు దానికొన నెగిరేడు; ఆయంతరాళంలో నెన్నో మేడలు కట్టేడు; విహారవనాలు వేయించికొన్నాడు; పూవుటీరాలల్లుకొన్నాడు; చలువపందిళ్లు కట్టుకున్నాడు; వసంతోదయ మని పలవరించేడు; అజరామరణ మని యానందించేడు; అనంత మని నాదమఱచేడు; నిదురించేడు; అసహాయుడయి విహరించేడు. ఏమయింది? ఒక్కటే గాలివాన పెట్టింది. మేడలు కూలినవి. లీలోద్యానాలు నేల గలసినవి. పూవుటీరాలు తుత్తునియలైనవి. చలువపందిళ్లు మాయమయినవి. మోహావతి పరలోకగతురా లయినది. ఈ ప్రళయంలో, ఈ మెడారిలో, ఈ యొంటిదిబ్బ మీద, ఈ బీభత్సమునడుమ దిస్సమొగముతో, దీనములయిన చూపులతో నిరుపేదమై నిస్సహాయుడయి నిలబడిపోయినాడు మధుసూదనరావు. రెక్కలు తెగిన పక్కివలె గడగడలాడినాడు. గూడు కానని పిట్టవలె గోలపెట్టినాడు. నేల తడవులాడినాడు. నింగి వెదకులాడినాడు. పలవరించినాడు. ప్రాకులాడినాడు. ఈ వేదనానలంలో వేగిపోతూన్న వానికి వరలక్ష్మి మూడునెలలబాలిక ఒకతృణం దొరకినది. ఇది పట్టుకొని యీదులాడుటకు ప్రయత్నించవలెను. ప్రయత్నించక తీరుతుందా?

మోహావతి కడసారి కనురెప్పలమాతలో మాటువడిన ప్రేమను పెకలించుకొనివచ్చేడు. ఆమెతో నుసియై నేల గలసిన ప్రేమను కూడ

బెట్టుకొన్నాడు. అట్లు చిలికి చిందరవందరయిన ప్రేమనుండి అతిప్రయత్నంమీద నొకయణువు గ్రహించినాడు. వరలక్ష్మిలో దానిని నాటుకొన్నాడు. జీవనేచ్ఛ దోహద మిడి దానిని పెంచికొన్నాడు. వెన్న పారవైచి వ్రేలు నాకికొన్నాడు. ఆహా, యేమి ప్రేమ తత్వము! ఏమి సృష్టినిర్మాణవైచిత్ర్యము!

మధుసూదనరావు ధనము గలవాడు. వానియిల్లూ, దానిచుట్టు ప్రాకారమూ, అందలి చినితోటా, నౌఖరులూ, దాదులూ, ఏలోపం లేకుండా ఉన్నాయి. వానినడుమ వరలక్ష్మి దినదినప్రవర్ధమాన యగుచున్నదనుట వింత కాదు. ఆమెముద్దునకు హద్దు లేదు. మధుసూదనరావున కానందించుటకంటె వేరుపనియే లేదు. వరలక్ష్మి పదునొకండేండ్ల బాలిక యయినది. ఆమెతో నాడుకొన నిరుగు పొరుగుల నాడుపిల్లలు లేకుండుటచేత నామె చిన్నప్పటి నుండియు మగపిల్లలతో కోతికొమ్మచ్చి, గోడిబిళ్లా, గోళీకాయలూ మొదలయిన మగయాటలకే యలవాటుపడినది. దుస్తులు మగదుస్తులే. జుట్టు గిరజాకత్తిరింపు. ఎప్పుడు చూచినసూ చేతిలో చిన్నకఱ్ఱ; చిన్నయీల పాట—వీనితో తోటలో పచారుచేస్తూంది. తోడిబాలుర నాటలకు రండని పిలుస్తూంది. పరుగెత్తుతూంది. పందెములు వేస్తూంది. మధుసూదనరావుకండ్ల కామే కూతురూ, ఆమే కొడుకూ.

ఆయుదయమున నామె యట్లాడి యాడి ఇంటిచావిటిలో వాలుడుకుర్చీలో కూర్చొని చిఱునవ్వు నవ్వుతూ తనవైపే చూస్తూన్న తండ్రికడకు పరుగుపరుగున వచ్చినది. చేతిలోని కఱ్ఱ క్రింద పారవైచి ఆమట్టిచేతులతోనే తండ్రికంఠము కౌగలించుకొని వానియొడిలో నిమిడి తన చెమట చిందే బుగ్గలు వాని మొగమున కంటించి, ముంగురులు, ముడుతలు పడిన వానినొసలంట తల నటునిటు త్రిప్పుచు వానిని ముద్దుపెట్టుకొనుచు వానిచేయి తీసి తన మెడ చుట్టికొనినది. వాని మొగము తేరిచూచి వెఱ్ఱివెఱ్ఱినవ్వు నవ్వినది. ఆమె నట్టే చూస్తూ ఆనందపరవశుడయి మధుసూదనరావలా కూర్చున్నాడు.

వరలక్ష్మి—నాన్నా! నాకు పెండ్లి చేస్తావా?

మధుసూదనరావు—ఔనమ్మా!

వరలక్ష్మి—వద్దు నాన్నా! పెండ్లయితే నే నత్తవారింటికి వెళ్లిపోవాలి కాబోలు!

మధుసూదనరావు— ఇప్పుడప్పుడే అక్కర లేదు. నీవింకా బాగా పెద్దదానవయిన వెనుక.

వర—అప్పుడయినా వెళ్లాలా?......... నీవుకూడా నాతో వస్తావా?

మధు—నే నెలా వస్తా నమ్మా?

వర:—అయితే నే నెలా వెళతాను నాన్నా? నాకు పెళ్లీ వద్దు, పేరంటం వద్దు. నేను నిన్ను విడిచి నిద్రయినా పోలేనే!

మధు—అలా అనకూడదమ్మా? ఆడుదానికి అత్తవారిల్లే శాశ్వతమయినది.

వరల—నీవు నన్ను వదిలేస్తేకదూ? పెద్దరికానికి నీవు నన్ను విడిచిపెట్టినా, నేను నిన్ను విడిచివెళ్ల లేనుసుమా. నేను నీసొమ్మును గదా నీదగ్గర ఉండడానికి నా కధికారం లేదూ? ఈయిల్లూ తోటా పాటియుఋనా చేయనా? అవి నీజీవితకాలమంతా నిన్ను విడువకుండా ఉంటాయిగదా, నే నెందు కలా ఉండకూడదూ?...ఉండవచ్చును నాన్నా! ఊరికే అలా అంటావు—నే నేమంటానో వినాలని—కాదూ?

మధు—నిన్ను విడిచిపెట్టడమంటే నాకూ కష్టంగానే ఉంటుంది. కాని మనసంఘ సూత్రా లలా ఉన్నాయి. అవి అతిక్రమించ డానికి మనకు సాధ్యం కాదు. తాతలనాటి నుండీ వస్తూన్న ఆచారాలు ఒక్కనాటితో మనకొరకు మారుతాయా? ఆడుపిల్ల యెదు గగానే ఆమె నొకఅయ్యకు ధారపోసేయాలి. నాటినుండీ పిల్ల ఆతని సొత్తే. ఆత డాపిల్లను ప్రేమతో పరిగ్రహించాలి. ఆపిల్ల ప్రేమతో వాని ననుసరించాలి. ఆతడు చెప్పినట్టూ నడు చుకోవాలి. ఇందులో ఏది తప్పినా సంఘ సూత్రాలు తెగేయున్న మాటే.

వరల—ఆసూత్రా లేం చేస్తాయి. జారు ముడిపడి బలిమిని మన కంఠాలను బిగిసిపోతా యేమిటి?అలా బిగిసిపీక ఉత్తరించేసూత్రాలు తెగితేనేమీ! గుడ్లగూబకోసం గువ్వ నిద్రపో వడంమానేస్తుందా? అది కాక, నాన్నా! బల వంతంగా నీ వీతనిని ప్రేమించాలని ఒకక్రొత్త వాణ్ణి తెచ్చి ఆడుపిల్లను వాని కొప్పకించేస్తే అంతేనా? ఆపిల్లఅంగీకారం అక్కరలేదూ? ఉన్నప్రేమను తుడిచీసుకొని లేనిప్రేమను నటించాలా? ఎందు కీదొంగపనీ, కపట నాటకం! సరే, ఇంతకుముందు ఎవళ్లెవళ్లో అలా చేసేరనుకో, మనమలా యెందుకు చెయ్యాలి? నీజీవితకాల మంతా నిన్ను నేను కనిపెట్టుకొని ఉంటే నీ కెంతసౌఖ్యం! నా కెంత ఆనందం!...ఏపెళ్లీ వద్దూ—ఇలా ఉండనీ నాన్నా!

మధుసూదనరా వామెను హృదయాన పొదివికొన్నాడు. ముందుకు వంగి తల ముద్దు వెట్టుకున్నాడు. వానికన్నులనుండి ఆనంద బాష్పాలు రాలేయి. వరలక్ష్మి కన్నులు గట్టిగా మూసికొని చిఱునవ్వు నవ్వుతూంది.

౨

"నాయనా సుబ్బారావూ, నీవు బుద్ధి మంతుడవు. నీకు విశేష మేమీ చెప్పనక్కర లేదు. తండ్రి నగుటచేత చెప్తాను. నాతల్లి వరలక్ష్మి వట్టిగోల. ఆమె కేమీ తెలియదు. ఆమె నెలా సంరక్షించుకుంటావో నీదే భారముసుమా!" అంటూ అల్లుని దగ్గరగ తీసికొని కౌగిలించుకొని "పోదునా?" యని వెనుకకు చూచినాడు. వరలక్ష్మి అత్తగారి కౌగిటిలో నిలిచి జాలిగ తండ్రివైపు చూస్తూ వలవలా కన్నీ రొలికించేస్తూంది. మధుసూదన రావు గిఱ్ఱున తల త్రిప్పికొని వెళ్లిపోవడానికి ప్రయత్నించేడు. అడుగులు నేలను తాపినట్టు

కదలేయి కావు; ముందుకు పడ్డాయి కావు. నాళము తెగిన ట్లొక్కమాటు వానిగుండె ఝల్లుమన్నది. అతడు గడగడ వడకినాడు. వాడి ముడుతలుపడిన వానికనురెప్పలు కెందామరరేకు లయినాయి. వానికి కుత్తుక బిగిసి పోతూన్న ట్లనిపించింది. కన్నీ రప్రయత్నంగా జారిపోతూంది. జాగు చేసిన కొలది వాని యాతేదన మితి మీరిపోతూంది. ముందడుగు పెట్టి విద్యాలవారిగుమ్మము దిగినాడు. వానికి పాతాళమున పడిన ట్లనిపించింది. చిమ్మచీకటి లోనికి దూకిన ట్లనిపించింది. శరీరమున గల ప్రతిరక్తనాలము నొక్కటొక్కటి తెగిపోతూన్న ట్లనిపించింది. ఎట్లో జేబురుమాలుతో కన్నీ రొత్తుకుంటూ స్వగృహోన్ముఖు డయినాడు. ఏమియిల్లు! దిస్సవడి విన్నబోయి దిగులుకొలుపుతూంది. చెట్లకొమ్మ లాతనిని చూచి జాలిగ రహస్యాలు చెప్పుకుంటున్నాయి. తీగకొనలు వడకేయి. పూలు వసివాడి వేడినిట్టూర్పులు విడుస్తున్నాయి. ఆతడు నడుస్తూన్న త్రోవ వన్నెచెడ్డ పటంలాగు వెడవెడపోయింది. ఇంటిలో ప్రవేశించినాడు. పంజరమున చిలుక "వరలక్ష్మేదీ?" అంది. కట్ట తెగిన ప్రవాహమై వానికి దుఃఖం పొంగిపొరలి వచ్చింది. వాలుడుకుర్చీలో కూలబడి జేబురుమాలుతో మొగము రెండుచేతులా కప్పుకొని మధుసూదనరావు వెక్కివెక్కి యేడ్చినాడు.

3

ఆగదిలో పూలపాన్పుమీద సుబ్బారావు క్రిందు చూస్తూ కూర్చున్నాడు. కొవ్వువత్తి దీపం కొనకూడా కొంచెం వంగి క్రిందు చూస్తూంది. గోడలపటా లన్నీ క్రిందు చూస్తున్నాయి. క్రిందను వరలక్ష్మి బోరగిల పడుక్కొని చేతుల మడతలో మొగం దాచికొంది. వడివడిగ వచ్చేయూర్పులతో నామె చిఱుప్రక్కలు చీనారేకులలాగు జిలజిలలాడుతున్నాయి. సుబ్బారావు మంచమునుండి దిగ్గన దిగి, "ఏమి టిది? లే! బాగుంది!" అని చేయి పట్టుకొని లేవనీసినాడు. వరలక్ష్మి లేచి యెదుటిగోడవైపు చూచింది. సైరంధ్రిని పైటచెరగు పట్టి లాగుతూన్న కీచకునిపటం కనిపించింది. త్రుళ్లిపడి వరలక్ష్మి కంపించింది. బెదరున ఆమె కనురెప్ప లదరినాయి

సుబ్బారావు—ఎందు కలా భయపడతావ్? నేను దుష్టుడనా? దుర్మార్గుడనా? నామీద నీ కెందుకు నమ్మకం లేదు? నాప్రవర్తనలో లోటు నీ కెక్కడయినా కనుపించిందా? లేక నీ కెవరయిన ప్రేలెత్తి చూపించారా? నీతో సమానుడ నయి కాలం గడుపుటకు నాజీవితసర్వస్వమూ నీకు ధారపోసిన నన్నిలా యెడపెట్టడం నీకు ధర్మమేనా? ఎంతకాల మిలా నన్ను వేధిస్తావు?"

వరలక్ష్మి పెడమొగము త్రిప్పినది. ఆ గోడను తృణము చేత పట్టుకొని రావణుని నిరసిస్తూన్న సీతపటం కనబడినది. వరలక్ష్మికి

కనుబొమలు ముడిపడినవి. ఆమె ఒక్క నిట్టూర్పు పుచ్చి కన్నులు మూసికొన్నది.

సుబ్బారావు—నీ కెందు కింతయలసటా? నీ కెందు కీయాయాసము? నేను త్రికరణముగ చెపుతున్నాను—నిన్ను కనురెప్పలలో పెట్టుకొని కాపాడుకుంటాను.

వరలక్ష్మి కన్నులు విప్పినది. జారిన పైట సర్దుకోలేదు. అలవాటు తక్కువ. మొగమున చెదరిన ముంగురులు తలమెగుపున సవరించుకొంది. గద్గదిక పోవునట్లు మెల్లగ మగవానివలె సకిలించింది. సుబ్బారావువైపు చూడకుండగనే "నే నేం చేసే" నంది.

సుబ్బారావు—ఇంక నేమి చెయ్యాలి? ఇప్పుడు నీవు నాకు కల్పించే వేదన చాలదూ? లోకంలో భార్య లందరూ ఇలాగే ప్రవర్తిస్తున్నారా? ఎన్ని దినము లయినది నీవును నేనును తొలిసారి కలిసికొనీ? ఎన్ని దినములనుండి నిన్ను మున్ను ప్రేల్లనయిన నంటకుండ నీవే సమాధానపడుదువని యోర్చికొనియున్నాను. ఎన్ని రాత్రు లడవిమల్లెలలా గనుభవమున కందకుండ విరిసివాడి రాలిపోయినవి? ఎన్ని యుగాతీతములయిన విషపుఘడియల గడపినాను? ఇదియేనా పత్నిధర్మము?

వరలక్ష్మి "నాదే అధర్మమా? ప్రేమ..." అనేసరికి ఆమెకు తండ్రి జ్ఞాపకమునకు వచ్చినాడు. డగ్గుత్తికపడి నోట మాట కదలినది కాదు.

సుబ్బారావు—ఎందు కాసంకోచం? నీయూహ ఏదో చెప్పు? దాని ననుసరించే పోతాను. నేను చెప్పినట్టు నీవో, నీవు చెప్పినట్టు నేనో వింటేనే గాని మనజీవితా లెలా సాగుతాయి?

వరలక్ష్మి "అదేమో నాకు తెలియదు" అని వెక్కి వెక్కి యేడ్చినది. మూసికొన్న యామెకన్నులలో ఒంటరియై విన్నదనమున వాలుడుకుర్చీలో పడి విలపించే తండ్రిలీల కనుపించినది. ఆమెకు వాని కన్నీ రొత్తా లనిపించింది. వడకే తన చిన్ని చేతులతో ముడుతలు పడినవాని చెక్కులు తట్టా లనిపించింది. వాని వేడివిచారపు నిట్టూర్పులలో తనముంగురు లెగిరించా లనుకొంది. మాటలాడి వానిచే దుఃఖమును మరపించా లనుకుంది. నే నిక్కడనే యున్నానని వానిని విషాదపు కలనుండి మేల్కొలపా లనుకొంది వానిచేత చిఱునవ్వు నవ్వించా లనుకుంది...కన్నులు విప్పింది. భర్తవైపు చూడలేక తిరిగీ కన్నులు మూసికొని నేల కొరిగి వెక్కి వెక్కి యేడువడం మొదలుపెట్టింది.

సుబ్బారావు తల యూచి పెదవులు బిగించి "నీకర్మం—నాతప్పు లేదు. లోకంలో నాకంటె మంచిమగ డుంటా డనుకోను. నాది అకల్మషప్రేమ. నిర్మలహృదయం. ఈ రెండును నీకు నచ్చకపోతే నేను దురదృష్టవంతుడ ననుకొంటాను. నీకు బుద్ధి మఱి మరలదు? అంతేనా? లేచి నాకు జబాబు చెప్తావా? నన్నావలకు పొమ్మన్నావా? ఈవేదన నిక

నేను భరించలేనుసుమా?...ఏమిా?...సరే! అయితే అలాగు ఒక్కర్తెవూ నేలను పడుకొని యేడుస్తూఉండు. నే నెక్కడికేనా పోతాను" అని గది విడిచినాడు.

* * * *

వరలక్ష్మి లేచి కూర్చుంది. వత్తిసవరింపు లేక దీపం సన్నగిల్లింది. ఆసన్ననివెలుగులో గోడలపటాలన్నీ చిన్నబోయినాయి. పూలపాన్పు మొగం ముడుచుకొన్నట్లున్నది. వరలక్ష్మి కన్నులు విశాలంగా విప్పి నాలుగు దిక్కులా చూచింది. మనుష్యసంచారమే లేని యేదో లోకంలో తా నొంటరిగా చిక్కువడిన ట్టనిపించిం దామెకు. ఆమె పుట్టినది మొదలు లోకతుణమైన న ట్లొంటరిగా నుండి యెఱుగదు. లేచినది. ఆమెగుండె ఝుల్లుమన్నది. శరీరమంతటనూ ఏదో ప్రాకిన ట్లనిపించింది. ఒంటరితనం భరించలేక ఆమె మెల్లగ పూలపా న్పెక్కి అక్కడి కిటికీతలుపు తెరచింది. గాఢమయిన ఆనిశాహృదయ మొంటరిగ సంచరిస్తూంది. ఆకురాలు చప్పుడయిన వినబడలేదు. చీకటి దీదీమని దిగులు కొట్టుతూంది. దానిని చీల్చుకొని వచ్చి చిన్నగాలిరివ్వ కిటికీలోనుండి వరలక్ష్మిబుగ్గలు వొడిచిన ట్లామె మొగమున దూసికొనిపోయింది. ఆమె త్రుల్లిపడి పాన్పు దిగి గదినడుమ నిలిచి అంతటా కలయచూచింది. ఆగదిలో నొకమూర సామాన్యమనుష్యునంతటి యెత్తున నమర్చిన యొకపటమునకు తెర వేయబడియున్నది. వరలక్ష్మి దానిని నిదానించి చూచినది. ఇట్లు తెరచాటున దాచుట కిందలి విశేష మేమో అని వడకుతూన్న చిన్ని చేతులతో మెల్లగ ఆతెర తొలగించింది. త్రుళ్లిపడి తెర వదలివేసింది. మరొక్కసారి చూడాలని తిరిగీ ఆతెర తొలగించింది. అందలిపటాన్ని యెగాదిగా చూచింది. ముఖము నిదానించి చూచింది. ఆయొంటరితనంలో ఆపటము స్నేహితునివలె తోచింది. ఆవిశాలమయిన కన్నులలో, ఆచిఱునవ్వు పెదవులలో, ఆచెక్కులనునుపులో, ఆసోగమెడలో, ఆముంగురులయుంగరాలలో. ఏదో లలితంగా కనబడింది. అలాచూచిందిఏదో అందం అందులో. చిందులాడింది. అలాచూచింది. ఏదో ప్రేమింపదగిన కళయొకటితలచూపింది. ఆమెనిలువలేకపోయింది. "ఏమిా! ఇంతలలితమయిన యీముఖాన్ని చూడడానికి నే నెందుకు బెదరేనూ? నాసీడ చూచి నేనే జంకినాను శాబోలు! ఆహా, ఈముఖ మెంత సుకుమారంగా, ఎంత అందంగా, ఎంత లలితంగా, పువ్వులాగు ఎలా కలకలలాడుతూందో! దీని నేమాడువాళ్లు తలనిడికోరు? నే నెంతమూర్ఖురాలను! ఎంతకాల మిామొద్దుమొగా న్నెడపెట్టేను! ఒక్కమాటు దీనిని ముద్దుపెట్టుకుందునా?" అనుకొని వడకుతూన్న పెదవులతో ఆపటము చెక్కిలి వేడిగ ముద్దుపెట్టికొని మోా మెడం చేసి కన్నులు మరింతవిశాలంగా విప్పి ఆపటము ముఖ మలా చూచింది. ఆచిఱునవ్వులో ప్రేమ

తరంగాలు దొరలుతున్నాయి. అలా చూచింది. ఆతరంగాలమీదినురుగులాగు జాలి రేకలుజాలు వారుతున్నాయి. అవిచూచి వరలక్ష్మిహృదయం కరగిపోయింది. తన్ను తాను నిందించికొన్నట్లు క్రిందిపెదవి ఇంచుక వంచి కన్నీ రొలికించేసింది. ఆకన్నీటి తెరలో ఆపటంముఖం మరింతజాలి కొల్పుతూన్న ట్టనిపించింది. వరలక్ష్మి ఆజాలి మరి భరించలేక నేలకు మెల్లగ ఒరగి చేతులు జోడించి నొసట కీలించి ఆపటమునుంగల సాష్టాంగముగ మ్రొక్కినది. పశ్చాత్తాప సూచకముగ వలవలా యేడ్చింది.

ద్వారము వెలుపల చీకటిలో నిలిచి ఇది అంతయు చూస్తూన్న సుబ్బారావానందపరవశు డయిపోయాడు. నిలువలేకపోయాడు. చప్పుడు చేయకుండ మెల్లగ వెళ్లి తనపటము నంటి ఆచట్టములో నిమిడినట్లు నిలుచున్నాడు.

వరలక్ష్మి దిగ్గన లేచి ఆలస్య మయిపోవునేమోనని భయపడినట్లు కన్ను లొత్తుకోకుండా, మొగాన్న చెదరిపోయిన అలకలు సవరించుకోకుండా అలాగు ముందుకు వంగి ఆపటము చెక్కిలి మరియొకసారి ముద్దుపెట్టుకుంది. ఆమె వడకుతూన్న పెదవు లామెత్తని చెక్కు లంటి మ్రాన్పడ్డాయి. ఏదో ఆమె శరీర మంతటా జిల్లుమని చెలరేగింది. ఆమె పరవశయై గాలిలోని లతకూనకొనవలె గడగడలాడి కన్నులుమూసికొంది. సుబ్బారావామెను రెండుచేతుల చెరదీసికొని యామె ముఖము తనహృదయమున కద్దికొని తల వంచి వెచ్చని కమ్మని యామెమూర్పుల దూసికొని ఆమెనొసలు ముద్దు పెట్టుకొన్నాడు. వాని యానందబాష్పము లొకటిరెండామె చెక్కుల జారినవి.

వసంతము

పెమ్మరాజు లక్ష్మీపతి గారు

నీకృపావీక్షణంబుల నిఖిలజగతి-నవ్యచైతన్య లక్ష్మి తా నాట్యమాడె;
మానినీ! యేల భావసమాధిఁ బూడ్చి-నను గటాక్షింప వింతయన్యాయ మున్నె?

కష్టసుఖములు పడుగుపేకలుగ, జనన-మరణములె యంచులుగ నేయు, మర్త్యజీవి
తాంబరంబున నను సంవృతాత్ముఁ జేసి-నీ వమర్త్యత నిల్పు టేనియతి చెపుమ!

పూవుల్ పూయు వసంత మిట్లు వృథయై పోవన్ మనఃపాత్రికన్
భావోద్రేక మడంగి పేరుకొనఁగా, బాహ్యాంతరంబుల్ రసా
భావంబున్ భజియింప ని న్ననుసరింపంబోలునే? నీదు లీ
లా వైచిత్ర్యము లిన్ని చూపి తిక నేలా కాలహింసాక్రియల్?